# చరమరాత్రి

నేను చాలా గొప్ప వాణ్ణి. మా పూర్వీకులందరూ గొప్పవారే. మా జిల్లా మొత్తంలో నాకెంతో పేరుంది. రాజధానికి వెళ్ళానంటే ఎంత క్లిష్టమైన పనులైనా సాధించగలను. బుర్ర మీసాలతో అజానుబాహువైన నేను నడుస్తుంటే మా పల్లె ప్రజలు గడగడ లాడిపోతారు. జమీందారీలు. జమీందారులు లేరంటారు గాని. మా ఊళ్ళో ఇప్పటికీ నాది జమీందారు హోదాయే.

మా ఇంట్లో పిల్లలు పుట్టినప్పటినుండీ వాళ్ళకొక నౌకరుని కేటాయిస్తారు. ప్రతి ఒక్కరికీ ఒక నౌకరు. ఆడపిల్లలకు పెళ్ళిళ్లు చేసి పంపేటప్పుడు చీరసారెలతో పాటు నౌకర్లను కూడా పంపే ఆచారముంది. 'ఎవర్రా అక్కడ' అంటే గజగజ లాడుతూ పదిమంది పరుగెత్తుకు రావలసిందే.

మా ఊళ్లో వాళ్ళందరూ నా భూమి మీదే బతుకుతున్నారు. చిన్న కారు రైతులకు తలా, పది, పరకా ఎకరాలు కౌలుకిచ్చినా, స్వయంగా నా ఆధ్వర్యాన వంద ఎకరాలదాకా సాగుబడి జరుగుతోంది. ఐదు బావులు, ఇంజన్లు అంతా ఆధునికంగా జరిగిపోతోంది. ఎక్కడా దొరకని ఎరువులన్నీ నాకు సులభంగా దొరుకుతాయి. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసులో ఏ క్రొత్తరకం విత్తనాలు వచ్చినా నా పొలంలోకి రావలసిందే. క్రొత్తక్రొత్త పరికరాలన్నీ మా పొలంలో ఉపయోగిస్తున్నారు. నా పొలాలు విరగకాస్తాయి. మనలోమాట. ఎంత పండినా ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టగలిగాను. పంటలకు రోగాలు తగిలాయనో, నీళ్లు చాలలేదనో, ఏదో ఒక వంక దొరక్కపోదు. ఉద్యోగస్తులందరూ నా చుట్టూ తిరిగే వాళ్ళేకదా.

నాకు వ్యతిరేకంగా ఏ పనైనాచేసి బతగ్గలరా? నేను మా ప్రాంతానికి 'అభ్యుదయ రైతును'. నా ఫొటోలెన్నో పేపర్లలో పడ్డాయి. నా గురించి చాలా మంది వ్యాసాలు వ్రాశారు. ఎందరో ఇంటర్వ్యూలు చేశారు. రేడియోలో నా ప్రసంగం ప్రసారమయింది కూడా.

ఇప్పుడు చెడ్డ పేరొస్తుందేమోనన్న జంకే గాని మునుపటి రోజుల్లో మా మాటకు ఎదురు తిరిగిన వాణ్ణి పచ్చిగా ఖూనీ చేసేవాళ్ళం. ఆ ఖూనీ చేసినట్టయినా బయటకు పొక్కేదే కాదు. అభ్యుదయ వాదులమనీ. సామాజిక వాదులమనీ డప్పాలు కొట్టుకొంటున్న ఈ కాలం వాళ్ళ సంగతి వదిలేస్తే ఇప్పటికీ మా మాటంటే ప్రజలు భయభక్తులతో వుంటారు. ఎవడైనా తల బిరుసుగా వున్నా, వాళ్ళ పొగరణచే మార్గాలెన్నో మాకు తెలుసు. పాకలు తగలబడటం, పంటకుప్పలు కాలిపోవటం. కాపలాకు వెళ్ళిన రైతును మక్కెలిరగదన్నటం వాళ్ళ అవిధేయతలకు శిక్షే. అంతకు పైబడి విచారణ జరిగినా నా పేరు పైకి రాదు. ఆ విచారణకూడా ప్రారంభదశలోనే మాసిపోతుంది. నాకు ఆ మాత్రం పలుకుబడి లేకపోలేదు.

ఎంత పలుకుబడి లేకపోతే విదేశాలన్నీ గవర్నమెంటు డబ్బుతో తిరిగి వస్తాను. అభ్యుదయ రైతును మరి. అన్ని దేశాలలో వ్యవసాయ పద్ధతులు చూసి రావద్దూ. విదేశాలన్నీ తిరిగి వచ్చాక సన్మానాలు కూడాను. నా అనుభవాల గురించి రైతులకు చెప్పాలట. పిచ్చి మొద్దులు వాళ్లకెందుకు? అర్థమవుతుందా, పాడా? అర్థమయితే మాత్రం ఆ పద్ధతులన్నీ అవలంబించే స్తోమత ఉండొద్దూ. ఒక బస్తా ఎరువు సంపాయించటమే గగనం. అయ్యా దొరా. అని చుట్టూ పదిసార్లు తిరిగి, నూరు పనులు చేసి పెట్టి, బి.డి.వో.కు సిఫారసు చేయమంటారు. నేనూ పోనీలే పాపం అని నరసింగరావుకు చిన్న చీటీ వ్రాసి పంపేస్తాను.

మా ఇంట్లో అన్ని ఆధునిక వసతులున్నా. ఆ పల్లెటూర్లో నేనుండేది చాలా తక్కువే. నా వంటి పెద్దమనుష్యులు ఒకే చోట పాతుకుపోతే పనులెలా జరుగుతాయి? అందులో నేను జిల్లా పరిషత్తు ఛైర్మన్ని. జిల్లా ముఖ్యపట్టణంలోనే (అసలది పట్నం కాదనుకోండి. మద్రాసుతో పోల్చి చూస్తే ఇదసలు పల్లెటూరే అనొచ్చు) చాలావరకు గడచి పోతుంది. అక్కడా నా ప్రతిభ దేదీప్యమానంగా వెలుగుతూ వుంటుంది. ఎవరైనా నా ఆగ్రహానికి గురి అయ్యారంటే వాళ్ళకిక పుట్టగతులుండవు. వాళ్ళను ఏ మారుమూలకో బదిలీచేస్తాను. నేను తలచుకుంటే జీతం, సెలవు, ఒకటేమిటి, అన్ని విషయాల్లోనూ గొడవలు మొదలవుతాయి. ఆ నాలుగు రాళ్ళమీద ఆధారపడినవాడు ఇంకెక్కడికి పోతాడు?

నాకు ఒక కారు ఉండనే ఉంది. రాకపోకలకు యిబ్బందిలేదు. ఉదయం మా ఊళ్ళో టిఫిన్ తిని మధ్యాహ్నం భోజనానికి మద్రాసు చేరుకోగలను. అసలు మద్రాసుకూ మాకూ చాలా సంబంధం ఉంది. మా ఇంట్లో ఎవరైనా జర్రున చీదినా మద్రాసు ప్రయాణం కట్టారు. చిన్న ఊళ్ళలో వైద్య సదుపాయాలేమీ బాగుండవు. అందులో మా పల్లెటూరు సంగతి సరేసరి. పేరుకు ఒక ధర్మాసుపత్రి వుంది. అదీ మా ఊరికి మంత్రిగారు వస్తుంటే నేనే నిలబడి ప్రారంభోత్సవం జరిపించాను. దానిలో ఓ కంపోండరూ, ఇంకో నర్సమ్మా. అంతే, డాక్టరెవడూరాడు. వచ్చినా రెండు రోజులకు మించి ఉండడు. అక్కడి రంగు నీళ్ళకంటే ఆచారి మాత్రలే బాగా పని చేస్తాయంటారు మా ఊరివాళ్ళు. పల్లెటూరి మొహాలుకదా. వాళ్ళ మూఢాచారాలు వదులుకొంటారా?

మాకు ఏ మాత్రం నలతగా వున్నా ముందు జాగ్రత్తతో పెద్ద డాక్టర్లకే చూపించుకుంటాం. జబ్బులున్నా లేకపోయినా ఆడపాదడపా పరీక్షలూ చేయించుకొంటూ ఉంటాం. మాకేం తిండికి కొరతా, సౌకర్యాలకు కొదవా? అయినా మాయదారి కాలం ఏవో జబ్బులు వస్తూనే ఉంటాయి. శ్రీమంతులకూ, జబ్బులకూ ఏ అవినాభావ సంబంధముందో తెలీదు.

మా పిల్లలు ఇంటి దగ్గరే చదువుకొంటారు. ఎవడి బడికో వెళ్ళవలసిన అవసరం మాకు లేదు. ఇంగ్లీషు టీచరు, లెక్కల మాష్టారు, తెలుగు పంతులు అందరూ ఇంటికే వచ్చి పాఠాలు చెబుతారు. మా ఊళ్ళో ఎనిమిదో తరగతి వరకు బడి ఉందిగాని ఆ చిల్లరబడికి మా పిల్లలు వెళ్ళరు. కాలేజీ చదువుల దాకా వస్తే వెళ్ళక తప్పదుమరి.

మంత్రులందరూ నాకు తెలుసు. కొందరితో నాకు బంధుత్వంకూడా ఉంది. ఏదో వాళ్ళ అవసరాలు నేను తీరిస్తే. వాళ్ళూ నా అవసరాలు తీరుస్తారు. నాకూ మంత్రి కావాలనే ఉంది. ఈసారి ఎలక్షన్లలో నిలబడాలని అనుకొంటున్నాను. ముందే చెప్పానుగా నా పలుకు బడికి ఎదురు లేదని. చుట్టూ ఉన్నది పల్లెటూళ్ళే. ఏముంది, అలగా జనానికి కల్లు పోయించి, తలా రూపాయి, అర్ధా చేతిలో పెడితేసరి. పెట్టకపోయినా ఓటు వేస్తారు. కాకపోయినా పని ముందు కొంచెం ఖుషీ చేస్తే మనకేం డోఖా ఉండదు. ఇదంతా నా దూరదృష్టి. ముందు జాగ్రత్త అనుకోండి.

మహారాజులా జీవిస్తూ లోకంలో కష్టాల గురించి ఆలోచనే లేకుండా కేవలం సుఖాలలో మునిగి తేలుతున్న సమయంలోనే నాకు పెద్ద విపత్తు వచ్చిపడింది. సిగరెట్టు, త్రాగుడు

మానెయ్యమని మా ఆవిడ ఎన్నేండ్లుగానో హెచ్చరిస్తూ వచ్చింది. ఆడవాళ్ళకున్న జబ్బే ఇది కదా! పదిమందిలో మర్యాద, మన్నన కావాలంటే తాగుడు ఉండి తీరాలి. ఎంతటి కాగితం మీదయినా సంతకాలు పడిపోతాయి. తాగినప్పుడు మనుషులెంత ఉదారంగా ఉంటారు! అందుకే నా గొప్ప మిత్రులకు ఎప్పుడు విందుచేసినా విదేశీ సరుకు సప్లయి జరిగి తీరుతుంది. 'విందంటే నాగరాజుగారి విందే విందు' అని లొట్టలు వేసుకొంటూ ఉంటారు చాలా మంది.

ఇంతకూ ఏమయిందంటే నాకు కొంచెం సుస్తీ చేసింది. సంఘ కార్యకలాపాల్లో మునిగిపోయి అంత పట్టించుకోలేదు. మరీ అధికమయ్యే సరికి మద్రాసు ప్రయాణం కట్టాను మందీ మార్బలంతో. మా ఫ్యామిలీ డాక్టరు కొన్నాళ్లు నన్ను నర్సింగ్ హోమ్‌లో విశ్రాంతి తీసుకోమన్నాడు. నా వంటి "పబ్లిక్ ఫిగర్సు"కు నిజమైన విశ్రాంతి ఎక్కడ దొరుకుతుంది? ఎన్ని వ్యవహారాలు, ఎన్ని కేసులు, ఎన్ని ఆలోచనలు! విశ్రాంతి ఏ మాత్రమూ పరిస్థితిలో మార్పు తీసుకు రాలేదు. డాక్టరుకు వెయ్యి రూపాయల బిల్లు అయింది. అయితే ఏంది. అదొక లెక్కా, జమా? నా బాధ అదికాదు. ఒకే కడుపు నొప్పి, కిడ్నీ ట్రబులన్నారు. ఇదన్నారు. అదన్నారు. చివరకు... చివరకు కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరమన్నారు.

కేన్సర్... నాకు కేన్సరా? ఇంతటి వాడికి, నాకు కేన్సరా? ఈ రోగమొచ్చి నయమయిన వాడు ఒక్కడు లేడే! పెద్ద పెద్ద వాళ్ళు విదేశాలకు వెళ్ళి చికిత్స చేయించుకున్నా ఏమీ లాభం లేకపోయిందే! మృత్యువు నా గుమ్మం దగ్గర నిల్చుంది. నా గుమ్మం దగ్గర... నాగరాజుగారి గుమ్మం దగ్గర! వేలకొద్దీ రైతులను హడల గొట్టాను. జిల్లా మొత్తం టీచర్లను గడగడ లాడించాను. పెద్ద పెద్ద ఉద్యోగస్తులను నోరెత్తకుండా చేశాను. 'నాగరాజుగారు తలచుకుంటే చేయని పనే లేద'ని ప్రతీతి. కాని... ఇప్పుడీ మృత్యువును ఏ విధంగా భయపెట్టగలను? మృత్యువుకు ఉద్యోగం పోతుందని భయమా? ఆస్తులు హరించి పోతాయని దిగులా? కోర్టులు తిరగాలన్న వ్యధా? పరువు నష్టమని బాధా? పదిమందిలో నగుబాటనే భీతా? పొలాలకు నీళ్ళు రావా? పంటకుప్పలు తగలబడి పోతాయా? కొరడా వీపున ఛెళ్ళు మంటుందా? కాలుకికాలు, చేయికిచేయి విడదీసేస్తారా? మృత్యువుకు ఏ భయముంది? నాగరాజంటే ఎందుకు భయపడుతుంది?

నా యాభై ఏండ్ల జీవితంలో పరాజయ మనేది ఎరుగనే. ఎవరి ఎదుటా తలవంచలేదే. నా విగ్రహ పుష్టి, పాలు. తేనెలతో, పండ్లు పలహారాలతో అతి జాగ్రత్తగా పెంచిన శరీరం

బూడిదయిపోతుందా? రేపు నా జ్ఞాపకం మాత్రం మిగులుతుంది. ఆ తర్వాత అదీ మరచిపోతారు. ఈ రోజు బ్రతికే ఉన్నాను. రేపటికి ఏమవుతానో ఏమో... ఆపరేషను మరి, కేన్సరు ఆపరేషను చేసుకొని బతికిన వాడొక్కడయినా ఉన్నాడా?

ఆసుపత్రికి తీర్థప్రజల్లా జనం వస్తూనే ఉన్నారు. పెద్దపెద్దవాళ్ళు. ధనవంతులు, మంత్రులు, అందరూ హోదాగల వాళ్ళే. వీళ్ళందరినీ చూస్తుంటే నా శవయాత్ర కళ్ళకు స్పష్టంగా కనిపిస్తోంది. నన్ను శ్రీగంధం చెక్కలతో తగలబెడితే మాత్రమేం? నేను మిగలను కదా! చావు తర్వాత ఏముందో అక్కడా ఒక స్వర్గం ఉంటే..

భగవంతుడా! నా మీద దయచూపు తండ్రీ! భగవంతుడు! ఇన్నేళ్ళ జీవితంలో ఎన్నాళ్ళకు గుర్తొచ్చాడు! ఇంతకు ముందు గుర్తుకురాలేదని కాదు. కాని అప్పుడూ నా హోదా వెలగ బెట్టూనే వెళ్ళాను. "నాగరాజుగారు... నాగరాజుగారు" నా కోసం దేవుడు ప్రత్యేకమైన దర్శనం ఇచ్చేందుకు ప్రత్యేకమైన పూజలు... ప్రత్యేకమైన ప్రసాదాలు. వెళ్ళినప్పుడంతా వెయ్యి రూపాయలు పారేస్తేసరి... ఆ ఏడు కొండలవాడి కొండే గజగజలాడి పోయేది... కళ్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ఎన్ని జరిపించానో, ఎన్ని దేవాలయాలకు ధర్మకర్తనయ్యానో... ఏం లాభం? అన్ని పూజలూ అన్ని ధర్మాలూ ఈనాడు నాకు సాయపడుతాయా? స్వర్గంలో నాకో స్థానమిస్తాయా?...

..దేవుణ్ణి సంతోషపెట్టగలిగితే ఎంత బాగుండు? ఆయనకు సన్మాన సభ ఏర్పాటు చేయనా? అపురూపమైన వస్తువులను కానుకగా ఇవ్వనా? ఆయన కొడుక్కు ఉద్యోగ మిప్పించనా? తన కూతురికి పెళ్ళి సంబంధం కుదర్చనా? విందు భోజనానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించనా? ఏ విధంగా దేవుణ్ణి సంతోషపెట్టగలను?

అసలు స్వర్గ నరకాలున్నాయో లేదో... లేకపోతే మాత్రం... ఇంత నాగరాజూ రేపు గుప్పెడు బూడిదయి పోతాడా? కాదా మరి? ఎంత మూర్ఖుణ్ణి! ఎంతమంది గొప్ప గొప్పవాళ్లు మట్టిలో కలవలేదు! గొప్ప గొప్ప రాజులు, మహా నాయకులు. ప్రాజ్ఞులు, తత్వవేత్తలు, కవులు, కళాకారులు, ఎందరు మృత్యువు వాత పడలేదు. ఇంత త్వరగా నామరూపాలు లేకుండాపోయే జీవితం చూసి ఎంత గర్వపడ్డాను. ఎందరిని ఏడిపించాను. ఎన్ని జీవితాలు నరక ప్రాయం చేశాను! ఎందరి రక్తం కళ్ళజూశాను! అనంత విశ్వంతో పోల్చి చూస్తే నేనెంత? నా గొప్పతనమేమిటి? నా కెందుకింత అహంకారం? చివరకు అందరూ చచ్చే చావే చస్తున్నాను. నా పలుకుబడి, నా హోదా ఏవీ నన్ను మరణబాధనుండి తప్పించలేవు కదా!...

బంధువులందరూ వచ్చారు. చాలా ఆప్యాయత ఒలకబోస్తున్నారు.... నాకు తెలుసు నా ఆస్తి గురించి విల్లు గురించి వాళ్ళ తాపత్రయమని. చివరకు నా భార్య కూడా అడిగింది "విల్లు వ్రాశారా?... నాకు అన్యాయం చేయకండి. ఈ కాలం డబ్బున్న వాడిదే రాజ్యం. కడుపున పుట్టిన పిల్లల్నే నమ్మలేం." రేపో మాపో చావబోతున్నాను. నా రూపురేఖలు మాసిపోతాయి. ఈ సమయంలో నా భార్యనుండి వినవలసిన మాటలివేనా? నేనేదో దూర ప్రయాణం పెట్టుకున్న తీరులో అన్నీ చక్కదిద్దమని హెచ్చరిస్తోంది... నిజమే ఇది దూరప్రయాణమే. ఇదివరకు నేను చేసిన దూరప్రయాణాలు ఎంతో గర్వకారణంగా ఉండేవి. ఆ అవకాశాలకోసం అడ్డుదార్లు తొక్క వలసివచ్చేది. ఈనాడు ఈ ప్రయాణం చేయాలనేలేదు. కాని దేవుడు దీన్ని నా నెత్తిన రుద్దుతున్నాడు.

చివరిసారిగా భగవంతుని ప్రార్థిస్తాను. ఆఖరి గడియలలో దేవుణ్ణి తలచుకుంటే ముక్తి యిస్తాడని విన్నాను. ఏమో నాకూ ముక్తి దొరుకుతుందేమో! ఆ అవకాశం ఎందుకు పోగొట్టుకోవాలి?... ఆపద మ్రొక్కులవాడికి మ్రొక్కితే ఈ ఆపదా దాటిపోవచ్చు. ఎవరు చూడొచ్చారు. నేనూ బ్రతకొచ్చు... వెంకటేశ్వరా! నీ దయ వలన బ్రతికి బయట పడితే నీకు బంగారు కిరీటం ... రాళ్ళ చంద్రహారం చేయిస్తాను... బ్రతకనీకపోతే మాత్రం.... వద్దు దేవుడా వద్దు. నాకు చావాలనిలేదు.... అయినా నీ గుండె కరగక నన్ను చంపాలనే నిశ్చయించుకొంటే... నాకు స్వర్గంలో కొంచెం చోటు కేటాయించు... మా వాళ్ళను పూజలు చేయించమంటానులే... తూర్పు ఎర్రబడుతోంది.... ఈ రోజే నా ఆపరేషన్... రేపటి సూర్యోదయం చూస్తానో లేదో! భగవాన్!

*(5 జూన్ 1970)*